ఆసుపత్రి సిబ్బంది సమస్యలపై ఏఐటీయూసీ వినతి

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, భద్రత, విష పురుగు నివారణ కార్మికులకు మూడు నెలల నుండి వేతనాలు చెల్లించక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ నాయకులు లగుడు వెంకటరమణ, కోన లక్ష్మణ్‌లు అన్నారు. ఆగస్టు నెలలో కాంట్రాక్టర్ అగ్రిమెంట్ గడువు కూడా ముగియనున్నదని, ఈ పరిస్థితుల్లో కార్మికులు గత్యంతరం లేని పరిస్థితుల్లో దశల వారి ఆందోళనలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామని, అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే శానిటైజేషన్ సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ సిబ్బంది పనులు నిలుపుదల చేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ నీల వేణికి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. దీనిలో భాగంగా శానిటైజేషన్ సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ కార్మికులకు బకాయపడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని, వేతనాలు ప్రతినెల 7వ తేదీ లోపున చెల్లించాలని, వేతనంతో కూడిన జాతీయ పండగ సెలవులు, ఎర్నడు లీవులు కలిపి మొత్తం 25 రోజులు సంవత్సరంలో సెలవులు ఇవ్వాలని, ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫాం కార్మికులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మికులకు రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలని, మూడు షిఫ్ట్‌ల పని విధానం రొటేషన్ పద్ధతిలో అమలు చేయాలన్నారు. పని భారానికి తగిన విధంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేసి పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మారినప్పుడు కార్మికుల తొలగింపు చర్యలు మానుకోవాలన్నారు.

ఎస్.ఎం.సి.లకు, సచివాలయ విద్యా సహాయకులకు శిక్షణ

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలో గల 61 ప్రభుత్వ పాఠశాలల విద్యా సంక్షేమ యాజమాన్య కమిటీ (ఎస్.ఎం.సి) చైర్మన్, వైస్ చైర్మన్‌లకు, సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారి కె.సింహాచలం మంగళవారం ప్రారంభించారు. చోడవరం మండల విద్యాశాఖాధికారి కె.సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో కార్యక్రమ శిక్షకులుగా గర్ల్స్ హైస్కూలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా ఐ.వి.రామిరెడ్డి, ఆర్.చిరంజీవి గర్ల్స్ హైస్కూలు చైర్ పర్సన్ గుమ్మాల సత్య వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ సింహాచలం నాయుడు మాట్లాడుతూ పాఠశాల సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యకు పాఠశాల యాజమాన్య కమిటీ కృషి చేయాలని, మధ్యాహ్న భోజనం, మరుగు దొడ్ల నిర్వహణను పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు బుధవారం, శుక్రవారం, సంక్షేమ సహాయకులు మంగళవారం, గురువారం నాడు ఫొటోలు తీసి, సంబంధిత యాప్‌లో ఖచ్చితంగా అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రతిరోజూ సంబంధిత పాఠశాల ప్రధానో పాధ్యాయులు యాప్‌లో పరిశీలనా పత్రంను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.కాలని స్కూల్ చైర్మన్ నేమాల హరి, లక్ష్మీపురం హైస్కూల్ చైర్మన్ నర్సింగరావు, గర్ల్స్ హైస్కూల్ వైస్ చైర్మన్ పిల్లి నాగమణి, తదితరులు పాల్గొన్నా రు.

యోగ క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన

విశాలాంధ్ర - చోడవరం: జిల్లా స్థాయి యోగ క్రీడల్లో గెలుపొందిన అనకాపల్లి జిల్లా చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు మంగళవారం ఓ కార్యక్రమంలో అభినందించారు. అనకాపల్లి జిల్లాలో గల ప్రముఖ యోగ గురువు పుల్లేటి సతీష్ వద్ద యోగ విద్యను అభ్యసిస్తున్న గూనురు పద్మజ, కొట్టాపు హరి కిరణ్, పొట్నూరు పవన్ కుమార్, గొంతిన లయ వర్ధన్, వేపాడ పూర్ణచంద్రరావు, పుల్లేటి క్రాంతి సాగర్, చింతాడ హర్షవర్ధన్ 7 మంది యోగ క్రీడాకారులు ఈనెల ఆగస్టు 26న పరవాడ మండలం వెన్నెలపాలెంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో వివిధ విభాగాలలో గెలుపొంది, రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. యోగ విజేతలందరికీ ఎమ్మెల్యే రాజు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో జరగబోయే రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో జాతీయ స్థాయి యోగ పోటీల్లో ఘన విజయం సాధించి చోడవడానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ యోగ క్రీడాకారులను అభినందించిన వారిలో మాజీ ఎం.పి.పి. గూనురు వెంకట సత్యనారాయణ (పెదబాబు), బొంతు దేముడు బాబు, యోగ కేంద్ర సభ్యులు పసుమర్తి అశోక్, డాక్టర్. రేపాక బంగారు కృష్ణ, బోగవిల్లి గణేష్, ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, అడ్వకేట్ శ్రీనివాస్, రెడ్డి అప్పారావు, రాయి సూర్యనారాయణ యోగ కేంద్రం సభ్యులు ఉన్నారు.

నేత్రదానం.. మహాదానం

విశాలాంధ్ర - పరవాడ: నేత్రదానం మహాదానమని పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి హారిక అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా వైద్యాధికారిణి హారిక ఆధ్వర్యంలో మంగళవారం పరవాడలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తాలమిక్ అధికారి ఆర్.వెంకట్రావు మాట్లాడారు. నేత్రదానంపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న వారు మాత్రమే నేత్రదానం చేయాలని చెబుతూ ఉంటారని, ఈ రకపు అపోహలను, అనుమానాలను పోగొట్టడానికే పక్షోత్సవాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని పేర్కొన్నారు. కంటి చూపు కోల్పోయిన వారికి దాతల నేత్రాల నుంచి కార్నియా మార్పిడి ద్వారా తిరిగి కంటి చూపును రప్పించవచ్చన్నారు. అన్ని మతాల వారు నేత్రదానానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. మరణించిన వ్యక్తి నుంచి ఆరు గంటల లోపు నేత్రాలను ఇవ్వడం చంచిదన్నారు.నేత్రదానం చేయాలను కునే వారు స్వచ్ఛంద సేవా సంస్థలు, ఐ బ్యాంక్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేసి అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును ప్రసాదించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరామ్, పిహెచ్ఎన్. జానకి రామన్, హెచ్‌విపివి రత్నం, ఏఎన్ ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా బోడపాటి శివదత్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో ఘనంగా జరుపుకున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంతో పాటు, పలు నియోజకవర్గాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు స్వయంగాను, ఫోన్‌ల ద్వారా శివదత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి పార్టీల నాయకుల సమక్షంలో శివదత్ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శాలువాలు, పూలదండలు, పుష్పగుచ్ఛాలతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మమతా హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం, మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయ కులు తోట నగేష్, లాలం కాసినాయుడు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, బొంది కాశీ విశ్వనాథ్, చింతకాయల రాంబాబు, పులగపూరి అప్పలనర్స, నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన జన సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం మండలానికి జెడ్పీ నిధులు విడుదల

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలానికి 30 లక్షల రూపాయల జెడ్పీ నిధులు విడుదలైనట్లు పాత్రికేయులు సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు 30 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. 9 గ్రామాలలో చేతి బోర్లు, రెండు కమ్యూనిటీ హాల్ భవనాలు, 10 గ్రామాల్లో సీసీ కాలు వలకు ఈ నిధులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో మండల ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడం చాలా సంతోషకరమైన విషయమని, నిధులు మంజూరు కావటానికి ముఖ్య కారణమైన జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబును అభినం దించారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా మాఫియాకు కొమ్ము కాస్తున్న ప్రభుత్వ అధికారులు

- పేదల నివాసాలు కూల్చి, కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్న అధికారులు
- అధికారుల దుశ్చర్యలపై మండిపడ్డ సి.పి.ఐ., మహిళా సంఘాలు

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాలకు పాల్పడే వారికి వత్తాసు పలుకుతూ, వారిచ్చే లంచాలకు కక్కుర్తి పడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు, నిలువు దోపిడీ చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారులను తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఐ, అనుబంధ ప్రజా మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ, పంచాయతీ స్థలాలను, రోడ్లు, డ్రైనేజీలు, పాత చెరువును దర్జాగా కబ్జా చేసిన బడాబాబులపై ఎటువంటి చర్యలు తీసుకోలేని అధికారుల కళ్ళు పేదల నివాసాలపై పడ్డాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏ.పి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలు పేదలపై మంగళవారం ఉదయం "ఆక్రమణలపై చర్యలు" అంటూ పంజా విసిరిన పంచాయతీ, పోలీస్ అధికారులపై బాధిత కుటుంబాలు, సి.పి.ఐ. నేత రెడ్డిపల్లి, మహిళా సంఘాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి మాట్లాడుతూ మాజీ ఉప సర్పంచ్ మారిశెట్టి సాగర్ ప్రోత్సాహంతో పంచాయతీ ఈ.ఓ. నారాయణరావు, పోలీసులు పేదలు నివాసాలపై దౌర్జన్యం చేయడం అన్యాయమన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులకు, అధికార ప్రజా ప్రతినిధులకు దమ్ముంటే చోడవరంలో కబ్జాలకు పాల్పడ్డ బడాబాబులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చోడవరం మేజర్ పంచాయతీలో సుమారు 280 పైగా పంచాయతీ స్థలాలు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. అధికార, ప్రతిపక్ష నేతలు అండదండలతో రెవెన్యూ సర్వే నెంబరు.82లో ప్రధాన రహదారిలో గల పాత చెరువు ఎండోమెంట్, ఆర్టీసీ, పంచాయతీ, రెవెన్యూ అధికారులు సాక్షిగా కబ్జాకు గురయిందని తెలియజేసారు. అలాగే చోడవరం - లక్ష్మీపురం రోడ్డులో రెవెన్యూ సర్వే నెంబర్ 11లో సుమారు ఎ.0-60 సెంట్లు పైగా కబ్జా కు గురైనట్లు సి.పి.ఐ. భూ పోరాటంతో, విశాలాంధ్ర వార్తలతో అప్పటి తహశీల్దార్ తిరుమల బాబు గుర్తించి, రెవెన్యూ సిబ్బందితో అడ్డుకట్ట వేసినప్పటికీ, రియల్ ఎస్టేట్ మాఫియా ఇచ్చే లంచాలతో నేటి అధికారులు మొద్దు నిద్ర నటిస్తుండగా రియల్ మాఫియా బరి తెగిస్తున్నారన్నారు. బడాబాబులు, వారిచ్చే పారితోషికాలు (లంచం)తో వారి పట్ల విధేయత కలిగిన ప్రభుత్వ అధికారులు గరీబోళ్లపై చర్యలు తీసుకోవడం చేతగాక తరచూ పేదలు, బడుగు బలహీనవర్గాలపై తమ దాష్టీకం చూపడం తగదని, దీనిపై బాధితులు పేదల పక్షాన భారత కమ్యునిస్టు పార్టీ పోరాడుతుందని తెలియజేసారు.

డ్రైనేజీల పేరుతో నిరుపేదల ఇల్లు ధ్వంసం చేసే పంచాయతీ అధికారులు, ఏళ్ల తరబడి డ్రైనేజీలు ప్రక్కనే నిర్మాణాలు కట్టి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా ఎటువంటి నోటీసు, సమాచారం లేకుండగా మాజీ ఉప సర్పంచ్ సాగర్ ప్రోత్సాహంతో పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, పేదలపై దౌర్జన్యంకు పాల్పడిన పోలీసులపై ఉన్నతాధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల తరఫున డిమాండ్ చేశారు. అధికారుల అనైతిక చర్యలు వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ శక్తులు కొమ్ము కాస్తున్నారని స్థానికులు ఆగ్రహం చెందారు.

ఐక్యమత్యంతో వర్గీకరణ విధానాన్ని అడ్డుకుంటాం

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపు

విశాలాంధ్ర - దేవరాపల్లి: ఎస్సీలంతా ఐక్యమత్యంతో వర్గీకరణ విధానాన్ని అడ్డుకుంటామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మండల కమిటీ కీలక నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో మండల నాయకులు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునః పరిశీలన చేయాలని కోరారు. వర్గీకరణ పేరుతో ఎస్సీ ఉప కులాల మధ్య చిచ్చు పెట్టే విధానాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేదంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. త్వరలో భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించి, ఎస్సీ ఉప కులాలు అంతా ఐక్యమత్యంగా ఉండి కలిసి పోరాడుతామన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా జరిగే ఈ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఎస్సీలంతా కలిసి రావాలని కోరారు. వర్గీకరణ విషయంపై ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలని, ఇలాంటి పరిస్థితులలో ఎస్సీలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పతివాడ నాగభూషణం, పరవాడ అప్పారావు, మచ్చ వీర్రాజు, సబ్బవరపు మాలిబాబు, టి.శ్రీరామ్, కార్లి సాయి సుందరరావు, కంచిమాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో పురపాలక శాఖ నిర్వీర్యం

మంత్రి పి.నారాయణ

విశాలాంధ్ర - విశాఖ: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పురపాలక శాఖ నిర్వీర్యమైపోయిందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. విశాఖ వీఎమ్మార్డీఏలో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో మున్సిపల్ మంత్రి ఉన్నాడో, లేడో తెలియని పరిస్థితి కనిపిస్తోందని విమర్శించారు. గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం వాడలేదన్నారు. 15వ ఫైనాన్స్ నిధులు ఎవ్వరూ వదలరని, ఆ నిధులు కూడా వదిలేశారని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన రూ.450 కోట్లను పక్కదారి పట్టించారన్నారు. ఫలితంగా కేంద్రం మూడు ఇన్‌స్టాల్‌మెంట్‌లు ఇవ్వలేదన్నారు. వైసీపీ హయాంలో టౌన్ ప్లానింగ్ అధ్వాన్నంగా మారిందని అన్నారు. టిడిఆర్ బాండ్లలో ఇన్ని అవకతవకలు చేయొచ్చా? అని వీళ్ళను చూసిన తరువాత తెలిసిందని, తాను ఆశ్చర్యానికి గురైనట్టు తెలిపారు. మాస్టర్ ప్లాన్ మీద అందరూ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. మాస్టర్ ప్లాన్ అంశంపై నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేస్తామని తెలిపారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖపట్నంలో ఉన్న అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు. గతంలో వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అనేక అవకతవకలు జరిగాయని, వాటిని సరి చేయాలని కోరామని తెలిపారు. ఐదు సంవ త్సరాల్లో కేంద్రం ఇచ్చిన నిధులను కూడా వినియోగించుకోలేక పోయారని విమర్శిం చారు. అనేక పన్నులు తీసుకొచ్చి వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని దుయ్యబట్టారు. జీవీఎంసీలో ఆదాయాన్ని పెంచడానికి కొత్త విధానాలు తీసుకురావలసిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. విశాఖకు పూర్వవైభవం తీసుకురావాలన్న ఉద్దేశంతో పని చేస్తున్నామని తెలిపారు.

సెమ్ పరిజ్ఞానంపై గీతం వర్క్‌షాప్

విశాలాంధ్ర - మధురవాడ: పదార్థ విజ్ఞాన శాస్త్రాలతో పాటు నానో సైన్స్ వంటి రంగాలపై పరిశోధనలు జరపడానికి ఉపయోగపడే స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపి (సెమ్) మరియు ఎక్స్‌రే డిఫ్రాక్షన్ సాంకేతిక పరిజ్ఞానంపై విశ్వవిద్యాలయం సైన్స్, ఇంజనీరింగ్ పరిశోధకులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దేశంలోని ప్రఖ్యాత అణు పరిశోధన కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు అధ్యాపకులకు సెమ్ పరిజ్ఞానంపై అవగాహన కలిగించారు. కల్పకం అణు పరిపరిశోధన కేంద్రం ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.అరుణ్‌దాస్, విశాఖలోని బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ప్రొఫెసర్ పిఎస్ఆర్ కృష్ణ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ బి.శ్రీధర్, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ వి.ఎస్.శర్మ, రాజారామన్న సెంటర్ ఫర్ ఎడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఇండోర్) శాస్త్రవేత్తలు డాక్టర్ ఎమ్.హెచ్.మోడి, బి.అశోక్ కుమార్ హజరయ్యారు. ఆధునిక మెటీరియల్ సైన్స్‌తో పాటు నానోట్యూబ్‌లు, నానో ఫైబర్‌లపై పరిశోధనలకు సెమ్ పరిజ్ఞానం ఉపయోగపడుతోందని వారు వివరిం చారు. గీతం మూర్తి ప్రయోగశాలల పర్యవేక్షకులు మరియు విశిష్ట ప్రొఫెసర్ బివిఆర్.టాటా సంధానకర్తగా వ్యవహరించారు. గీతం ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డైరక్టర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.శర్మ మాట్లాడుతూ సెమ్ పరిజ్ఞానంతో వైద్య, జీవ శాస్త్ర రంగంలో, ఫోరెన్సిక్ సైన్స్, జియాలజీ పరిశోధనలను చేపట్టవచ్చునని తెలిపారు. దేశంలోని అతి తక్కువ విద్యాసంస్థలలో మాత్రమే అందుబాటులో ఉండే ఈ సాంకేతిక పరిజ్ఞానం గీతం మూర్తి ప్రయోగశాలలో సమకూర్చామని అధ్యాపకులు వీటిని ఉపయోగించుకొని దేశం గర్వించ తగ్గ పరిశో ధనలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గీతం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేధవతి, ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగే ఈ వర్క్‌షప్ కోఆర్డినేటర్‌లుగా డాక్టర్ కె.లక్ష్మణ్‌నాయుడు, డాక్టర్ బి.సత్తిబాబు, డాక్టర్ హరిహరిపాండే వ్యవహరిస్తున్నారు.

వైభవంగా చెవిటి నూకలమ్మ తల్లి పండగ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గుడివాడ పంచాయతీ పరిధిలోని కొత్త పోలవరం గ్రామంలో చెవిటి నూకలమ్మ తల్లి పండగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు సహకారంతో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూళి శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ ఎన్. వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

దోమలు బాబోయ్ దోమలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: చిన్న దోమ గ్రామాలలో ప్రజలను ముచ్చెమటలు పట్టిస్తూ, అధికారుల పనితీరును వెక్కిరిస్తుంది. గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించడం, అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టక పోవడం వలన బస్తీ మే సవాల్ అన్నట్లు దోమలు వృద్ధి చెంది కాటేస్తున్నాయి. దోమకాటుతో మంచాలు పట్టే వారి సంఖ్య పెరుగుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెంది కాటేస్తున్నాయని, దీంతో జ్వరాలు మరింత ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. దోమల నివారణకు అధికారులు నిధులు పూర్తిస్థాయిలో వినియోగించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాలు ఎక్కడా కనిపించడం లేదని, కనిపించినా తూతు మంత్రంగా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ

విశాలాంధ్ర - మాకవరపాలెం: కోల్‌కతాలో ఆర్.జి.కార్, మెడికల్ కాలేజ్ హాస్పటల్‌లో డా.మౌమిత దెబ్నదా పీజీ రెండవ సంవత్సరం చదువుతున్న మెడికల్ విద్యార్థిని హత్యాచారాన్ని నిరసిస్తూ మాకవరపాలెంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ (పబ్లిక్ రైట్స్) చింతా వి.ఆర్.ఎస్.శర్మ ఆధ్వర్యంలో వైద్యురాలు శ్రీవిద్య, వైద్య సిబ్బంది నిరసన తెలిపారు ఈ ర్యాలీ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: 33/11 కెవి యలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి యలమంచిలి టౌన్ ఫీడర్ లైన్ మెయింటనెన్స్ (చెట్లు తొలగింపు) నిమిత్తం బుధవారం ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తపేట, మిలటరీ కాలనీ, యానాద్రి కాలనీ, స్టేషన్ రోడ్, మధురా నగర్, నాగేంద్ర కాలనీ, కోర్ట్ పేట, భవనం వీధి, గాంధీనగర్, ద్వారకానగర్, నెహ్రూనగర్, శేషుగెడ్డ శివాలయం వీధి ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. అవకాశం ఉన్న చోట ప్రత్యామ్యాయం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

29న ఏఎల్ పురంలో మరిడిమాంబ జాతర

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల కొంగుబంగారమైన మరిడిమాంబ జాతర మహోత్సవం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ తెలియజేశారు. ప్రతి ఏడాది నిర్వహించే జాతర మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగానే 27, 28 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రథమ స్థానం పదివేల రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకి 5వేల116 రూపాయలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా 28వ తేదీన జాతర కార్యక్రమం ఉంటుందని, 29వ తేదీన అమ్మవారి పండుగ నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

పశువులకు సకాలంలో టీకాలు వేయాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామాల్లో ఉన్న ప్రతి పశువును గుర్తించి వాటి నివారణ టీకాలు వేయాలని పశు వైద్యశాల సహాయ సంచాలకులు ఈ.దినేష్ కుమార్ పశువైద్య గ్రామ సహాయకులను ఆదేశించారు. మంగళవారం ఈ మండలం చౌడువాడ, గుల్లేపల్లి, అలమండ, ఏ.కోడూరు, వారాడ, వి.సంత పాలెం రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు గ్రామాల్లో ఎన్ని పశువులకు టీకాలు వేశారు అన్నది పరిశీలించారు. సెప్టెంబర్ 18వ తేదీ లోపు పశు బీమా, గాలికుంటు నివారణ టీకాలు, బ్రూసెల్లో సిస్ టీకాలు పూర్తి చేయాలన్నారు. దేవరపల్లి, కె.కోటపాడు మండలాల్లో మొత్తం 38 వేల పశువులు ఉన్నాయని ఇప్పటి వరకు సుమారు 5000 పశువులకు టీకాలు పూర్తి చేసామని దినేష్ కుమార్ తెలిపారు.

కామేశ్వరమ్మ ఆలయం వద్ద బీజేపీ వర్క్ షాప్

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం రాచపల్లి జంక్షన్ వద్ద వెలసిన కామేశ్వర ఆలయం వద్ద బిజెపి సభ్యత వర్క్ షాపు జరిగింది. ముఖ్య అతిథిగా నర్సీపట్నం అసెంబ్లీ కో కన్వీనర్ వెలగా జగన్నాథం, మండల అధ్యక్షులు మర్రి నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబిసి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పి.బాబురావు, ఏ.ఆంజనేయ మూర్తి, చింతపల్లి పెంటయ్య, మండల కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

మంత్రి నారాయణను కలిసిన రైతు శ్రీనివాస్

విశాలాంధ్ర - పరవాడ: రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగులేటి నారాయణను జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం విశాఖలో కలిసి వార్డులోని పలు సమస్యలను వివరించారు. జీవీఎంసీ మహానగర పరిధిలోని 79వ వార్డుతో పాటు పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను వివరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా కొండవాలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను కట్టడి చేయాలని ఆయన కోరారు. నీటి శౌర్యం కారణంగా భూగర్భ జలాల అడు గంటుతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు.